# ముసలి మొగుడు - పడుచు పెళ్లాం

డియర్ డార్లింగ్ మాలా! నీకీ ఉత్తరం ఎలా ప్రారంభించాలో కూడా తెలీటంలేదు. నీ జీవితాన్ని చూసి జాలిపడనా? లేక నీ యవ్వన మంతా బూడిద పాలౌతోందని సానుభూతి చూపించనా? నిన్ను చూస్తుంటే నాలో కలిగే వేదనా, తపనా నీ కెలా తెలియజెప్పాలో అర్థమవటంలేదు. ఆ ముసలి వాడి చేతుల్లో పడి నీ జీవితాన్నలా నరకప్రాయం చేసిన నీ వాళ్లని ఎలా నిందించాలో తెలీటంలేదు. నాలాంటి ఏ చక్కటి, చిన్న ఆఫీసర్‌కో భార్యవై, కార్లో శ్రీవారి వళ్లో వాలిపోతూనో, లేక స్కూటర్ మీద మీ వారి భుజాల చుట్టూ చేతులేసుకుని మురిపిస్తూ, కవ్విస్తూ కబుర్లు చెప్పుకొంటూనో షికార్లు కొట్టవలసిన నీ జీవితమంతా నేడో, రేపో రిటైరు కానున్న ఓ ముసలాడి చేతుల్లో మగ్గుతూ, నీ యవ్వనమంతా అడవి కాచిన వెన్నెలయి పోతూంటే చూస్తూన్న నా మనస్సెలా పరితపిస్తోందో వ్రాయాలన్నా మాటలు దొరకటంలేదు. ఇప్పటికైనా మించిపోయిందేం లేదు మాలా! నువ్వు 'ఊ' అను - నీకు స్వర్గసుఖాలని చూపిస్తా, నీ కనుసైగ చాలు నీ జీవితం మారిపోవడానికి నేను బ్రహ్మచారిని. రాత్రి ఆ ముసలాడు పడుకోగానే ఒక్కసారి నా గదికిరా! అన్నీ మాట్లాడుకుందాం. మనం కలిసి రాధా, మాధవుల్లా కలకాలం ఆనందిద్దాం. రాత్రికి పుట్టెడాశతో ఎదురుచూస్తున్న...

నీ మాధవ్

ఆ ఉత్తరం చదవడం పూర్తిచేసిన మాలతి గబగబా ఆ ఉత్తరాన్ని మడిచి జాకెట్‌లో దాచేసింది. ఇటూ అటూ చూసి ఎవ్వరూ చూడలేదన్న నిర్ధారణ కాగానే పమిట కొంగుతో ముఖానికి పట్టిన చమట తుడుచుకుని వంటింట్లోకెళ్లి, గ్లాసెడు మంచినీళ్లు తాగి అక్కడే కూలబడిపోయింది. లయ తప్పిన ఆమె గుండె కొట్టుకోడం ఆమె చెవులకి వినిపిస్తోంది.

"ఎంత ధైర్యం ఈ ఎదిరింటి మాధవ్‌గాడికి!! ఓ పెళ్లైన ఆడదానికి ప్రేమలేఖ రాసే అంత సాహసమా?! వీడి దుంపతెగ! ఎంత మగాడైతే మాత్రం?! అదృష్టవశాత్తూ ఈ ఉత్తరం నా చేతుల్లో పడింది. ఖర్మకాలి ఆయన చేతుల్లో పడుంటే?? అమ్మ బాబోయ్- యింకేమన్నా వుందా? ఈ రోజుతో నా పని సరి!! అసలే అనుమానం మనిషి. క్షణం క్షణం అనుమానంతో వేపుకుతినే ఈయనకీవిషయం తెలుస్తే తన బ్రతుకేమయ్యేది? ఇంట్లోంచి పొమ్మంటే పోవడానికి అటు పుట్టింటా దిక్కులేదాయె! బీదరికంతో రోజు గడవని తండ్రి తన యిరవైయ్యేళ్ల యవ్వనాన్ని నేడో, రేపో రిటైరయ్యే రెండో పెళ్లివాడి చేతుల్లోపెట్టి తను ఈ లోకం నుంచే శలవు తీసుకున్నాడు. తన అదృష్టమింతే- అని సరిపెట్టుకుని గుట్టుగా బ్రతుకుతున్నా. భర్తకి తన మీద

అనుమానం రోజు రోజుకీ ఎక్కువయి పోయి- నుంచుంటే తప్పు, కూర్చుంటే తప్పు, నవ్వితే తప్పు, ఏడిస్తే తప్పు అన్నట్లు కాల్చుకుతింటున్నాడు. దిక్కుమొక్కులేని తను మైనం ముద్దలా ఎటు వంచితే అటే వంగిపోతూ భర్త ఆడే మాటల్ని సహిస్తూ, భయం భయంగా నాలుగ్గోడల మధ్య మగ్గిపోతున్న తనకీ ఉత్తరం రావడ మేమిటి? ఏం చెయ్యాలిప్పుడు? ఇది సాయంత్రం భర్తకి చూపిస్తే?? అమ్మో!! ఇంకేమన్నా వుందా? నువ్వు ఏ లోకువా యివ్వకపోతే వాడెందుకంత ధైర్యంగా రాస్తాడీ వుత్తరం? అని పీక్కు తినెయ్యడూ? ఇది వరకు వీధిలో నిలబడితే ఈ మాధవ్‌గాడికోసమే నిలబడ్డానని రాసి రంపాన పెట్టాడు. దిన దిన గండంలా వున్న తన బ్రతుకిది తోడైతే ఏంకాను? తల్చుకుంటేనే కాళ్లూ చేతులూ స్వాధీనం తప్పిపోతుంటే!

పోనీ ఆ ఉత్తరం చింపేస్తే?? మళ్లీ మరొకటి రాయడనేముంది? నా ఖర్మకాలి ఆ ఉత్తరం ఈయన చేతుల్లో పడితే?! ఆ తలంపు రాగానే ముచ్చెమటలు పోసేసి వణికిపోసాగింది మాలతి.

"ఆ ఎదురింటి మాధవ్‌కి ఎలా బుద్ధి చెప్పాలి? మళ్లీ యిలాంటి వెధవ రాతలు మరెవ్వరికీ వ్రాసి నాలాంటివారి జీవితాన్ని నాశయం చెయ్యొద్దని గట్టిగా చీవాట్లేసి వస్తే బాగుండదు. కానీ ఎలా?" అనుకుంటూ వుండగానే తలుపు తట్టిన శబ్దం అయింది. గబగబా లేచి జాకెట్లో దాచిన ఉత్తరాన్ని పెట్టె అడుగున చీరమడతల్లో పెట్టి ముఖం తుడుచుకుని తలుపు తెరిచింది. ఎదురుగా భర్త!

"తలుపు తియ్యడాని కింతసేపు పట్టిందేం?" అంటూ యిటూ, అటూ అనుమానంగా చూస్తున్న భర్తని చూడగానే గుండెల్లో దడ ప్రారంభమయి, చెమట్లు పట్టసాగాయి. ఎంత దాచుకుందామన్నా దాగని భయం ముఖంపై ప్రస్ఫుటంగా గోచరించింది.

"లోపల పన్లో వున్నానండీ!" అంటూ తనలోని తడబాటునీ, ఆందోళననీ కనబడనీకుండా తప్పించుకోడానికి "మంచి నీళ్లు తెస్తా"నంటూ వంటింటి వైపుకి వెళ్లిపోయింది.

"ఏడిసావ్‌లేగానీ, తొందరగా వంటకానీ రాత్రి ఆఖరి బస్సుకి వూరి కెళ్లాలి. మళ్లీ రేపు రాత్రిలోగా వచ్చేస్తాను. ఇంట్లో జాగ్రత్తగా తలుపులేసుకుని తగలడు" అంటూ నూతివైపుకు నడిచాడు దయానందం.

దయానందం వెళ్లి గంటదాటింది మాలతి మెల్లిగా లేచి వెళ్లి, పెట్టెలో దాచిన ఉత్తరం తీసుకుని బైటికొచ్చి, వీధి తలుపువేసి, ఎదురింటికి గబగబా వెళ్లి, మాధవ్ గది తలుపు మెల్లిగా తట్టింది. తలుపుతీసి "మీరా!" అంటున్న మాధవ్ దవడ పగిలేలా లెంపకాయ కొట్టి, ముక్కలు ముక్కలుగా చింపిన ఉత్తరాన్ని ఆతని ముఖంమీదికి విసిరి, "మరెప్పుడూ యిలాంటి ఉత్తరాలు రాసి ఏ ఆడదాని జీవితం నాశనం చెయ్యడానికి ప్రయత్నించకు దుర్మార్గుడా! నీకు కావాలంటే బజారు మనుష్యులు బోల్డుమంది దొరుకుతారు. ఛీ-థూ-" ఉమ్మేసి క్షణం ఆగకుండా, ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్న గుండెల్ని చేతుల్లో అదిమి పట్టుకుని పరుగులాంటి నడకతో

యింటిలోకి అడుగుపెట్టి తలుపు తీస్తున్న మాలతికి, స్పృహ తప్పిపోయినంత పనయింది. తన వెనకే దయానందం నిలబడి వున్నాడు. తియ్యబోయిన గడియ తియ్యలేక వణికిపోసాగింది. "ఎలాంటి ఉధృతాన్నెదుర్కోవాలో భగవంతుడా! ఉదయం ఈ ఉత్తరం గురించి చెప్పేసి ఉంటే యిప్పుడీ గొడవ వుండకపోను" అనుకుంటూనే తలుపు తీసింది.

లోపలికివచ్చి "ఆఖరి బస్సు పాడయిందట మాలతీ! వెనక్కొచ్చేసాను" అంటూ నవ్వుతూ కబుర్లు చెప్తున్న దయానందం వైపు పిచ్చిదానిలా చూడసాగింది మాలతి. అతనిలో వచ్చిన మార్పుకి కారణం తెలీక. మాటలు రానిదానిలా నిలబడిపోయింది. అకస్మాత్తుగా భర్త యింత వుదారుడు, విశాల హృదయుడు అయిపోయాడేమిటని ఆశ్చర్యపోవడం గమనించనట్లే ప్రవర్తిస్తున్నాడు దయానందం.

మర్నాడు సాయంకాలానికి మాధవ్ గది ఖాళీ అయిపోయింది.

ఆ మాధవ్‌గాడు ఆ గదిలో దిగిన దగ్గర నుంచి తిండి సయించక, నిద్రపట్టక అవస్థపడుతున్నాను. "హమ్మయ్య! ఒక్క దెబ్బకి రెండు పిట్టలు అటు వాడూ గది ఖాళీ చేసాడు, ఇటు మాలతెలాంటిదో తెలిసింది. బలే అయిడియా వచ్చింది కదూ?! ఇక నిశ్చింతగా నిద్రపోవచ్చు" అనుకుంటూ మంచమెక్కి, నడుంవాల్చి క్షణంలో గురకతియ్యసాగాడు అనుమానప్పిశాచి వదిలిన ముసలి దయానందం.

**– కలువబాల, జూన్ 16-30, 1985**